సాక్షి పెద్దపల్లి

గురువారం ¦ 5 ¦ జనవరి ¦ 2023



ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

ఇసుక లారీలు అతివేగంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేశారు. - 8లో



మురికి నీటిగోస మళ్లీ మొదలు

కార్మిక కుటుంబాలకు మళ్లీ మురికినీటి గోస మొదలైంది. పదిరోజులుగా రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. - 10లో

గరిష్టం/కనిష్టం 31.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. పొగమంచు దట్టంగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ప్లీడర్ చక్రపాణికి అదనపు బాధ్యతలు

గోదావరిఖని: గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్) మేడ చక్రపాణికి కలెక్టర్ సంగీత అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టుతోపాటు మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు, రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టు, సీనియర్ సివిల్ కోర్టులకు ఇన్‌చార్జి ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఎండీఆర్ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: బొగ్గు గనుల ప్రైవేటీకరణకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో చేసిన ఎంఎండీఆర్ (మైనింగ్ మినరల్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టాన్ని రద్దు చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే –1వ, గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సంక్షేమంలో దూసుకుపోతున్న తెలంగాణను దెబ్బతీసేందుకే కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీని గద్దె దించితేనే సింగరేణి అస్తిత్వాన్ని కాపాడుకోగలుగుతామన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో గనుల వేలం చట్టాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ వనరులను కాపాడుకునేందుకు పోరుదీక్షకు అంకురార్పణ చేశామన్నారు. కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, జెడ్పీటీసీ ఆముల నారాయణ, టీబీజీకేఎస్ నాయకులు సుంకరి నారాయణ, వడ్డేపల్లి శంకర్, జాహిద్‌పాషా, పుట్ట రమేష్, విజయారెడ్డి, మాదాసు రామ్మూర్తి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

గోదావరిఖని: రానున్న ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ కార్యకర్తలకు సూచించారు. బుధవారం నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శారదానగర్‌లో ఏర్పాటు చేశారు. కాషాయ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పార్లమెంట్ విస్తార సురేష్, రైల్వేబోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, నాయకులు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, దుబాసి మల్లేశ్, మందల కిషన్‌రెడ్డి, బల్మూరి అమరేందర్‌రావు, కోదాటి ప్రవీణ్, బద్రి దేవేందర్, పిడుగు కృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆరోగ్యమిషన్ పథకం కింద ఏర్పాటయ్యే 39 పల్లె దవఖానాల్లో కాంట్రాక్టు పద్ధతిన మెడికల్ ఆఫీసర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు www.peddapalli.telangana. gov.inలో దరఖాస్తు పొందాలని సూచించారు.

ఆరోగ్యమంత్రి గారూ... ఆలకించండి..!

- జిల్లాలో మొక్కుబడిగా సర్కారు వైద్యసేవలు
- వసతులలేమితో రోగులకు తప్పని తిప్పలు
- నేడు జిల్లాలో హరీశ్‌రావు పర్యటన



సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో రోగులకు ప్రభుత్వ వైద్యం కొంత అందని ద్రాక్షగానే మారింది. ఆసుపత్రులు ఉన్నా.. వైద్యుల కొరత వేధిస్తోంది. జిల్లాకేంద్రంతోపాటు మంథనిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ పోస్టులు వెక్కిరిస్తున్నాయి. ఎన్నో ఆశలతో ఆసుపత్రికి వస్తున్న రోగులకు సకాలంలో వైద్యం అందక నిరాశే ఎదురవుతోంది. ఈ క్రమంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హరీశ్‌రావు గురువారం ధర్మారం మండలంలోని నందిమేడారంలో 30 పడకల పీహెచ్‌సీ ఆసుపత్రికి శంకుస్థాపన చేసేందుకు గురువారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీపై, ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యల పరిష్కారానికి విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మాతాశిశులో అందని పూర్తిస్థాయి సేవలు

- మంథని మాతాశిశు ఆరోగ్య కేంద్రంపై నిర్లక్ష్యం కొనసాగుతోది. ఇద్దరు స్త్రీ వైద్య నిపుణులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. ఇద్దరు మత్తు డాక్టర్లకు ఇక్కడ పోస్టింగ్ ఇవ్వగా వేరే ప్రాంతానికి డెప్యూటేషన్‌పై పంపించారు. ఆరోగ్య కేంద్రంలో పిల్లల వైద్యుడు పోస్టు లేదు. 20 మంది వైద్య సిబ్బందికి 13 మందే ఉన్నారు. థియేటర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంథని మాతాశిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభం నుంచి 85 ఆపరేషన్లు జరిగాయి. ఇందులో 23 నార్మల్, 62 సీజేరియన్లు జరిగాయి.
- జిల్లాకేంద్ర ఆసుపత్రితోపాటు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యుల మంజూరు 53 పోస్టులకు రెగ్యులర్ డాక్టర్లు 23మంది, ఒప్పంద వైద్యులు 10మంది సేవలందిస్తున్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలందటం లేదు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, ప్రజాప్రతినిధులు

సభ ఏర్పాట్ల పరిశీలన

ధర్మారం: హరీశ్‌రావు నందిమేడారం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, వైద్య విధాన పరిషత్ అధికారి శ్రీధర్ పరిశీలించారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం.. గులాబీమయం..

హరీశ్‌రావు రాక సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లతో నింపేశారు. దీంతో ధర్మారం గులాబీమయంగా మారిపోయింది. హరీశ్‌రావు జక్కన్నపల్లి నుంచి మేడారం వరకు 3వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధి కమిటీ నియామకం ఎప్పుడో..?

- మెడికల్ కాలేజీ ఏర్పాటుతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని రామగుండం ప్రభుత్వ జనరల్ అప్‌గ్రేడ్ చేశారు. దీంతో అప్పటివరకు ఎమ్మెల్యే చందర్ చైర్మన్‌గా ఉన్న ఆస్పత్రి అభివృద్ధి కమిటిని ఈ ఏడాది మే 24న రద్దు చేశారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కు కలెక్టర్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ.. జూలై 6న ప్రభుత్వం జీఓ 395 జారీ చేసింది. కానీ ఇప్పటికీ వరకు అభివృద్ధి కమిటీ నియామకం జరగలేదు. దీంతో ఆస్పత్రి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ గాడితప్పుతోంది.

సమస్యలు ఇవే....

- ప్రభుత్వం నార్మల్ డెలివరీలు చేయాలని.. అనవసరంగా సిజేరియన్లు చేయవద్దని సూచించినప్పటికీ జిల్లాలో సిజేరియన్లు అధికంగా సాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాసుపత్రుల్లో 434 నార్మల్ ప్రసవాలు చేయగా.. 1026 సిజేరియన్లు చేశారు. వీటికి ప్రైవేట్ ఆసుపత్రుల సిజేరియన్లు అదనం. దీనిపైన ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.
- ఐదు మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న సుల్తానాబాద్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసే వెసులుబాటు లేదు. దీంతో పోస్టుమార్టం కోసం శవాలను జిల్లాకేంద్రానికే పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని మార్చురీలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది.
- నింబధనల ప్రకారం పట్టణాల్లో 50వేల జనాభాకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ఉండాలి. ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సు, ముగ్గురు ఏఎన్ఎంలు, ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్, వైద్యుడి సహాయకుడు, వాచ్‌మెన్, హెల్పర్ ఒకరు చొప్పున ఉండాలి.
- జిల్లా కేంద్రంలో ఒక అర్బన్ హెల్త్‌సెంటర్ లేకపోవడంతో పట్టణప్రజలు రాగినేడు, రాఘవాపూర్ పీహెచ్‌సీలకు వెళ్తున్నారు.
- సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలో సుమారు 50వేల జనాభా ఉన్న నేపథ్యంలో ఇక్కడ ఒక్కో అర్బన్ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.
- జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణపనులు తుదిదశలో ఉన్నాయి. దీన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తే ఒకేచోట 54రకాల పరీక్షలు చేరువ కానున్నాయి.
- గర్రెపల్లి పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఉత్తర్వులు రావాల్సి ఉంది. తద్వారా కేంద్రం ఆ ఆసుపత్రిని క్రిటికల్ కేర్ సెంటర్‌గా గుర్తించి ముగ్గురు స్పెషాలిస్ట్ డాక్టర్లను కేటాయించే అవకాశం ఉంది.
- పెద్దపల్లిలో ఎన్‌జీవోల సహకారంతో ఏర్పాటు చేసిన 500 ఎల్‌ఎఫ్ఎం (లీటర్ ఫర్ మినట్) సామర్థ్యమున్న ఆక్సిజన్ కేంద్రం అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఇది అందుబాటులోకొస్తే జిల్లాసుపత్రిలోని 50 పడకలు, మాతా శిశుసంరక్షణ కేంద్రంలోని 100 పడకలకు ఏకధాటిగా ఆక్సిజన్ అందించే వీలుంటుంది.
- పట్టణప్రాంతాల్లో వైద్యసేవలను విస్తృతం చేసేందుకు జిల్లాకు నాలుగు బస్తీ దవాఖానలు మంజూరయ్యాయి. రామగుండంలో రెండు ప్రారంభించారు. అయితే పెద్దపల్లిలో స్థలంలేక ఇంకా ఏర్పాటు కాలేదు.
- జిల్లాకేంద్రంలో పది పడకలతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినా.. సిబ్బందిని కేటాయించకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు.
- సుల్తానాబాద్‌లోని 30పడకల ఆసుపత్రిని 50పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని గతంలో ఆరోగ్యశాఖమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాల్సి ఉంది.
- జిల్లాలో 49 పల్లెదవాఖానాలు మంజూరు కాగా.. అందులో 36మంది వైద్యులు నియామకం జరిగింది. వీరిలోనూ ఉన్నత చదువుల కోసం సెలవు పెట్టడంతో ప్రస్తుతం కేవలం 23మంది మాత్రమే సేవలందిస్తున్నారు.
- గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో మొత్తం 132మందికి 100మంది, సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథనిలో 123మందికి 70మంది వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులు, గైనకాలజిస్టుల కొరతతో రోగులకు నాణ్యమైన వైద్యం అందటం లేదు.

నేడు పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో ఫోన్‌ఇన్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో 'సాక్షి' 'ఫోన్‌ఇన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తోంది. జిల్లా కేంద్రంగా పెద్దపల్లి అవతరించడం.. అందుకు తగ్గట్టు అన్నిహంగులను అందిపుచ్చుకునేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు, విస్తరిస్తున్న కొత్తకాలనీల్లో సమస్యలపై మమతారెడ్డి వివరిస్తారు. ప్రజలు సలహాలు, సూచనల కోసం నేరుగా మాట్లాడే అవకాశాన్ని 'సాక్షి' కల్పిస్తోంది.

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 05 - 01 - 2023

సమయం: ఉదయం 9 నుంచి 10గంటల వరకు

సెల్ నంబర్: 9989823488

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

- రామగుండం సీపీ చంద్రశేఖర్‌రెడ్డి
- సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం



మాట్లాడుతున్న సీపీ చంద్రశేఖర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: సీసీ కెమెరాలతో నేరాలను తగ్గించే అవకాశముందని సీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పట్టణం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించిన కమాండ్ కంట్రోల్ రూంను పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల ఛేదనకు పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. పోలీసులు చట్టంప్రకారం పనిచేసేలా ప్రభుత్వం ప్రతి పోలీసుస్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిందన్నారు. స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం డీసీపీ రూపేశ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై ఉపేందర్‌రావు, కానిస్టేబుల్ తిరుపతినాయక్‌ను అభినందించారు. పట్టణంలో 45, గ్రామాల్లో 480 సీసీ కెమెరాలు, రాజీవ్ రహదారిపై 9 ప్రాంతాల్లో 25 హైమాస్ట్ లైట్లు, మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ సారంగపాణి, ట్రాఫిక్ సీఐ అనిల్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు అశోక్‌రెడ్డి, వినిత, వెంకటకృష్ణ, మహేందర్, వర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కొక్కరికి ఐదు కిలోలే..!



గోదాము నుంచి బియ్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

- నేటి నుంచి 19వ తేదీ వరకు పంపిణీ
- డీలర్లకు చేరిన 3,506 టన్నుల బియ్యం

సుల్తానాబాద్: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) ద్వారా కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేపడుతోంది. కరోనా సమయం నుంచి ఉచితంగా అందిస్తున్న కేంద్రం.. దానిని ఈ ఏడాది చివరివరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రతివ్యక్తికి ఐదు కిలోల చొప్పున ఇవ్వనుంది. అయితే కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉచిత బియ్యం అందిస్తోంది. దీంతో లబ్ధిదారులకు నెలకు పది కిలోల చొప్పున అందుతున్నాయి. కేంద్రం ఉచిత బియ్యం అందిస్తామని ప్రకటించినా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో ఈనెల లబ్ధిదారులకు కేంద్రం అందించే ఐదు కిలోలే అందించనున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్ తెలిపారు. ఆ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు రాగా.. బియ్యాన్ని గోదాముల నుంచి డీలర్లకు తరలించే పనిలో పడ్డారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం 413 చౌకధర దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 2,10,147 కార్డులున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిపి 10 కిలోల చొప్పున ఇస్తే 7,012 టన్నుల బియ్యం అవసరమవుతాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం పంపిణీపై ఆదేశాలు రాకపోవడంతో డీలర్లకు సగమే చేరనున్నాయి.

ఐదు కిలోల చొప్పున అందిస్తాం



రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఉచితంగా 5 కిలోల చొప్పున బియ్యాన్ని ఈనెల ఐదో తేదీ నుంచి పంపిణీ చేస్తున్నాం. ఈ మేరకు గోదాం నుంచి అన్ని డీలర్ల షాపులకు బియ్యం పంపిణీ పూర్తయింది.

– వెంకటేశ్, డీఎస్ఓ

జిల్లాలో ఇలా..

మొత్తం షాపులు	413
యూనిట్లు	6,27,841
రేషన్‌కార్డులు	2,10,147
అన్నపూర్ణ	175
అంత్యోదయ	12,297

ఎన్టీపీసీ ఏజీఎం విజయలక్ష్మి బదిలీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయలక్ష్మి గుజరాత్ రాష్ట్రంలోని ఎన్టీపీసీ జానూర్ గాంధార్‌కు బదిలీ అయ్యారు.



చిన్నారి నృత్య ప్రదర్శన





యువజనోత్సవంలో భాగంగా జానపద నృత్యంలో పోటీ పడుతున్న విద్యార్థినులు..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, డీఈఓ మాధవి, ఇంటర్ నోడల్ అధికారి కల్పన

ఆకట్టుకున్న యువజనోత్సవాలు..

పెద్దపల్లిరూరల్: యువత ప్రతిభా నైపుణ్యాలతో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జిల్లాకేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో బుధవారం యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలను పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, డీఈఓ మాధవి, ఇంటర్ నోడల్ అధికారి కల్పన, ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు హాజరయ్యారు. యువత సాంస్కృతిక, క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలని మమతారెడ్డి పేర్కొన్నారు. అనంతరం జానపద గేయ, జానపద నృత్య పోటీల్లో విజేతలకు జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బహుమతులు అందించారు.



బహుమతులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

ఇసుకలారీ ఢీకొని వృద్ధురాలు మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఇసుక లారీ ఢీకొని అన్నాడి బుచ్చవ్వ(75) అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్సై ఉపేందర్‌రావు వివరాలు.. సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బుచ్చవ్వ పని నిమిత్తం సుల్తానాబాద్‌కు వచ్చింది. ఈక్రమంలో పోత్కపల్లి రీచ్ నుంచి హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇసుక లోడ్‌తో అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి వృద్ధురాలిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద అల్లుడు అనంతరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం


రాజ్‌కుమార్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన నాగపురి రాజ్‌కుమార్ (20) మంగళవారం రాత్రి రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తమకు దక్కాల్సిన భూమి విషయమై నాన్నమ్మ నాగపురి వీరమ్మ, అత్త బుర్ర స్రవంతి మానసిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ సెల్‌ఫోన్‌లో వాట్సాప్ మెస్సేజ్ పెట్టుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉరేసుకొని గర్భిణి ఆత్మహత్య


సంధ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కూనారం గ్రామానికి చెందిన సంధ్య(24) బుధవారం పుట్టింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఏడాది క్రితం సంధ్యకు వరంగల్‌కు చెందిన బొట్టు శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఆరునెలల గర్భిణి. వారం రోజుల కిందట సంధ్య బోనాల కార్యక్రమానికి పుట్టింటికి వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు కొట్టె రమాదేవి-రాజేందర్ పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉన్న కూతురును చూసి గుండెలు బాదుకున్నారు. ఘటనకు సంబంధించి కారణాలు తెలియలేదు. హైదరాబాద్‌లో ఉన్న సంధ్య సోదరుడు మహేందర్ వస్తేనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..


అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


పోలీసులతో బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి వాగ్వాదం

- కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో
- అతివేగానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్

సుల్తానాబాద్: ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో అతివేగంతో వెళ్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సుల్తానాబాద్‌లో బుధవారం రాస్తారోకో చేశారు. అంబేడ్కర్ చౌరస్తా మూలమలుపు వద్ద లారీ కింద పడిన బుచ్చవ్వ చనిపోయిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. మానేరు నది నుంచి ఓవర్‌లోడ్‌తో.. అతివేగంగా లారీలు వెళ్లడం ద్వారా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా అధి కారులు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. లారీ డ్రైవర్లు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. ఓదెల, సుల్తానాబాద్ మండలాల నుంచి ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్న కాంట్రాక్టర్లు రూ.కోట్లు ఆర్జిస్తున్నారని తెలిపారు. వాహనాలు పట్టణం మీదుగా కాకుండా బైపాస్ ద్వారా వెళ్తే ప్రమాదాలు జరగవని సూచించారు. వృద్ధురాలి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. అప్పటికే ఇసుక లారీలు భారీగా నిలిచిపోవడంతో ఎస్సై ఉపేందర్‌రావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, కౌన్సిలర్లు డి.రాజయ్య, రాజు, రఫీక్, కుమార్, కిశోర్, స్థానిక నాయకులు ఉన్నారు.

పర్యావరణ అనుమతులు లేకున్నా రవాణా

పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్ రెడ్డి అన్నారు. లారీ ప్రమాదంలో బుచ్చవ్వ మృతి చెందారనే సమాచారంతో సుల్తానాబాద్ చేరుకుని ఆందోళనకు దిగారు. అనుమతి లేకుండా మానేరు నుంచి ఇసుకను తరలించొద్దని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మానేరు పరిరక్షణ కమిటీచైర్మన్ కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించండి


ఎంపీ వెంకటేశ్ నేతకు వినతిపత్రం ఇస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు, గ్రామస్తులు

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో భూములు కోల్పోయిన మేడిపల్లి గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలో ఎంపీ వెంకటేశ్ నేతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ, మేడిపల్లి ఓసీపీ-4లో భాగంగా ఎస్సీ కాలనీకి సంబంధించి ప్రజల నివాస గృహాలు, భూములను తీసుకున్నారని, ఇప్పటివరకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వలేదని తెలిపారు. గతంలో కలెక్టర్‌కు, సింగరేణి అధికారులకు అనేకసార్లు విన్నవించినా నేటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన చెందారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వెలికితీసిన మట్టిని క్వారీలో నింపాలని, సేకరించిన ఓసీపీ-4 భూమిని ఇతర సంస్థలకు అప్పగించకుండా మేడిపల్లి భూనిర్వాసిత గ్రామానికి కేటాయించాలని కోరారు. కాగా పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, సింగరేణి అధికారులతో ఎంపీ వెంకటేశ్ నేత ఫోన్‌లో మాట్లాడి, నిర్వాసితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేడిపల్లి గ్రామస్తులు సనపురి శ్రీనివాస్, రామటెంకి మల్లేశ్, విశ్వనాథ్, చందనగిరి శివ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మోముపై చిరునవ్వులు చిందాలి

- డీసీపీ (అడ్మిన్) అఖిల్‌మహాజన్


మాట్లాడుతున్న అఖిల్‌మహాజన్

గోదావరిఖని(రామగుండం): చిన్నారుల మోముపై చిరునవ్వులు చిందాలని డీసీపీ (అడ్మిన్) అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్-9 దఫా స్పెషల్ డ్రైవ్‌ను పురస్కరించుకుని కమిషనరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అయినవారికి దూరమై క్షణమొక యుగంగా బతుకుతున్న చిన్నారులను చేరదీసి ఆదుకోవాలన్నారు. తెలంగాణ పోలీసులు 'ఆపరేషన్ ముస్కాన్-9' ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31 వరకు కొనసాగుతుందన్నారు. 18 ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలివేయబడిన, కార్మికులుగా ఉన్న బాలబాలికల సమాచారం సేకరించి, రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టిచాకిరి చేయించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకునేలా మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లోని ప్రతీ డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించామన్నారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించేందుకు పోలీసు శాఖ ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రతీ జనవరిలో ఆపరేషన్ ముస్కాన్, జూలైలో ఆపరేషన్ స్మైల్ పేరుతో ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు అశోక్ రెడ్డి, వహీద్, డీఎంహెచ్ఓ వెంకటేష్, డీఈవో విజయ్‌కుమార్, సీడబ్ల్యూసీ మెంబర్ శ్యాంసుందర్, సుమలత, లేబర్ ఆఫీసర్ రాజలింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాపులో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని పీవీ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమొబైల్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ. కోటి మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. దుకాణంలో దాదాపు రూ.3కోట్ల మేర విలువ చేసే సామగ్రి ఉండగా అగ్ని ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగిందని అగ్ని మాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని నాలుగైదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగారు.

తడకల కుంభకోణంలో క్లర్క్ డిస్మిస్

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన తడకల కుంభకోణంలో బాధ్యులుగా ఉన్న క్లర్క్‌ను యాజమాన్యం డిస్మిస్ చేసింది. ఈమేరకు సింగరేణి సంస్థ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 2020లో కుంభకోణం జరగ్గా, దీనిపై విజిలెన్స్ విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. లోతుగా విచారించిన అధికారులు సుమారు రూ.30లక్షల మేర గోల్‌మాల్ జరిగినట్లుగా గుర్తించారు. వెంటనే స్పందించిన యాజమాన్యం అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్లను ఉద్యోగాల నుంచి తొలగించింది. అందులో పనిచేస్తున్న క్లర్క్‌ను బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీకి బదిలీ చేసింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం కుంభకోణానికి బాధ్యుడిగా భావిస్తూ క్లర్క్ జక్కుల నారాయణను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

హత్య కేసు నిందితులపై పీడీయాక్టు


పీడీయాక్టు ప్రతులు అందిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం: సుపారీ తీసుకొని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులపై తిమ్మాపూర్ పోలీసులు పీడీయాక్టు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన శనిగరపు అరవింద్, పరుశురాంనగర్‌కు చెందిన నాగిరెడ్డి నిఖిత్‌రెడ్డి తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని ఉపష్ను హోమ్స్‌లో నివాసముంటున్నారు. ఒక మైనర్ బాలుడి ద్వారా వీరిద్దరికీ కొమ్మెర అరుణేందర్‌రెడ్డి పరిచయమయ్యాడు. అత్త గుజ్జుల సులోచనతో విభేదాలున్నాయని ఆమెను హత్య చేయాలని అరుణేందర్‌రెడ్డి వారిద్దరిని కోరాడు. దీనికోసం రూ.60 వేలు, ఫిష్‌ఫారం మేనేజ్‌మెంట్ అప్పగిస్తే చంపుతామని చెప్పి రూ.10 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. గతేడాది అక్టోబర్ 6 తేదీన గుజ్జుల సలోచనను హత్య చేసి, ఆమె తల్లి రాధమ్మపై హత్యాయత్నం చేశారు. గతంలో అరవింద్‌పై రామగుండం కమిషనరేట్ పరిధిలో రెండు నేరాలున్నాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో సంచలనం రేపిన ఈ ఘటనతో సాధారణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరిపై బుధవారం పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత ఉత్తర్వులను చర్లపల్లి సెంట్రల్ జైలులో అందించారు. ఈ సందర్భంగా పీడీయాక్టు అమలులో కీలకపాత్ర పోషించిన తిమ్మాపూర్ సీఐ కె.శశిధర్‌రెడ్డి, పీడీసెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సత్యనారాయణ అభినందించారు.

రామాలయంలో చోరీ

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుంపుల గ్రామంలోని మానేరు సమీపంలో గల శ్రీరామాలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బు ఎత్తుకెళ్లారు. ఎస్సై మహేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు ఆరెల్లి ఐలయ్య బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలించారు.

బొగ్గుబాయి వార్తలు

యంత్రాలు వినియోగిస్తూ లక్ష్యాలు సాధించాలి


మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

- ఆర్జీ- 3 జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించుకోవాలని ఆర్జీ- 3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు సూచించారు. ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో బుధవారం రెండు(క్రేన్)ఎస్కాట్‌లు, ఒక మొబైల్ సర్వీస్ వ్యాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. 12 టన్నుల సామర్థ్యం కలిగిన ఒక్కో ఎస్కాట్ (క్రేన్) విలువ రూ.22లక్షలు, మొబైల్ సర్వీస్ వ్యాన్ విలువ రూ.36 లక్షలు ఉంటుందని వివరించారు. నూతన యంత్రాల కొనుగోలుకు అనుమతించిన సీఅండ్‌ఎండీ ఎన్. శ్రీధర్, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. యంత్రంలో ఏవైతే రక్షణ పరికరాలున్నాయో వాటిని తూచ తప్పక పాటించి, రక్షణతో పనిచేయాలన్నారు. యంత్రంలో చిన్న మరమ్మతు పని ఉన్నా త్వరగా రిపేరు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎం.నాగరాజు, ఇన్‌చార్జి మేనేజర్ అనుగ్రహ నారాయణ, సివిల్ ఎస్ఈ పద్మరాజు, ఎస్ఈ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఫిట్ సెక్రెటరీ వేముల రవిశంకర్, జీఎం కమిటీ సభ్యులు పర్శ బక్కన్న, దేవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో సత్తా చాటాలి


క్రీడా దుస్తులు అందజేస్తున్న జీఎం

గోదావరిఖని(రామగుండం): కోలిండియా పోటీల్లో సింగరేణి జట్టు విజయం సాధించాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ ఆకాంక్షించారు. ఈనెల 5 నుంచి మందమర్రిలో జరిగే సింగరేణి స్థాయి లాన్‌టెన్నిస్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. సింగరేణి స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చి కోలిండియా స్థాయికి ఎంపిక కావాలన్నారు. కోలిండియా జట్టులో మన ప్రాంతానికి చెందిన వారే ఎక్కువగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీఈఆర్ క్లబ్ కార్యదర్శి హమీద్, టెన్నిస్ క్రీడాకారులున్నారు.

వేతన ఒప్పంద సాధనలో బీఎంఎస్ కీలకపాత్ర


మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): మెరుగైన 11వ వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం ఓసీపీ-3 బేస్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోలిండియా యాజమాన్యంతో చర్చలు జరపడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకవచ్చినట్లు తెలిపారు. వేతన ఒప్పందం త్వరగా అమలయ్యేలా చూస్తామని, త్వరలోనే కార్మికులందరికీ కొత్త జీతాలు, ఏరియర్స్ అందేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కుమారస్వామి, రవీందర్, వేణుగోపాల్‌రావు, హరీశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు సరఫరా చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): కార్మిక కుటుంబాలకు సురక్షితమైన నీటిని అందించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్(పా) చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గతేడాది నుంచి సింగరేణి కార్మికులు నివసించే కాలనీలో మురుగునీరు రావడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయన్నారు. దేశానికి వెలుగులు పంచుతున్న కార్మికులకు పక్కన ఉన్న గోదావరినది నుంచి సురక్షిత నీటికి నోచుకోకపోవడం బాధగా ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సీఎస్ఆర్- డీఎంఎఫ్ఐడీ నిధులు మంజూరు చేసి వాటర్ ప్లాంట్లను నెలకొల్పాలన్నారు. లేకుంటే మిషన్‌భగీరథ నీటిని తాత్కాలికంగా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేసిన జాతీయ సంఘాలు


నినాదాలు చేస్తున్న నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి కాంట్రాక్టు కార్మికులను జాతీయ కార్మిక సంఘాలు మరోసారి మోసం చేశాయని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న ఆరోపించారు. సెంటినరీకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 11వ వేజ్ బోర్డులో కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరీ వేతనం అమలు చేయాలని అనేక సందర్భాలలో జాతీయ కార్మిక సంఘాల నాయకులకు వినతి పత్రాలు సమర్పించినా వేజ్ బోర్డులో కాంట్రాక్టు కార్మికుల తరఫున ఏ జాతీయ సంఘాల నాయకులు, సింగరేణి యాజమాన్యం మాట్లాడలేదని విస్మయం వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికులకు 19 శాతం వేతనాలు పెంచిన జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికులకు ఎందుకు పెంచలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై చర్చించకపోవడం బాధాకరం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను జాతీయ సంఘాల నాయకులు మోసం చేశారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ ఆరోపించారు. బుధవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల తరఫున ఏఒక్క జాతీయ కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి యాజమాన్యం చర్చించకపోవడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు గట్టయ్య, పోచం, రాయమల్లు, బుచ్చమ్మ, గౌరక్క, జయమ్మ, మల్లేశ్వరీ, విజయ్ కుమార్, సమ్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




ట్రినిటిలో ఫ్రెషర్స్ డే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ రెడ్డిగార్డెన్‌లో బుధవారం ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీ బీటెక్ విద్యార్థులు 'ఆగమనం- 2కే 23' పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ట్రినిటి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించి ఉద్యోగాల్లో స్థిరపడేలా ప్రత్యేక దృష్టి సారించామని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతి ప్రదానం చేశారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, సురేశ్, రాజిరెడ్డి, నటరాజన్, ప్రభాకర్, స్వాతి, వెంకటస్వామి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.